ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 22 మే 2024

ఊరంతా జాతర

- వజ్రకిరీటంలో వెలిగిపోయిన గంగమ్మ
- అన్నదానాలు, అంబళ్ల ప్రసాదాల వితరణ
- నేడు విశ్వరూప దర్శనం



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర చేసుకుంది. అమ్మలగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. అంబళ్లు పోసి తాపం తీర్చింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని భక్తి పారవశ్యంతో చిందేసింది. వారం పాటు రోజుకో అలంకరణతో దర్శనమిచ్చిన తాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం ఉదయాత్పూర్వం మహాభిషేకం చేసి శాంతింపజేశారు. స్వల్ప తోపులాట మినహా మహాభిషేక కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. సర్వాలంకారశోభితురాలైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు.అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లుదండాలు, అడుగడుగు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.టీపీ ఏరియాలోని తాళ్లపాక పెదగంగమ్మ, చింతల చేనులోని ముత్యాలమ్మ,దాసరిమఠంలోని మాతమ్మ, పల్లివీధిలోని వేశాలమ్మ, చింతకాయవీధిలోని కరిమాను గంగమ్మలతో పాటు నగరంలో వున్న చిన్న గంగమ్మ ఆలయాల్లో కూడా జాతర సంబరాలు అంబరాన్నంటాయి.మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. గత ఏడాదికన్నా ఈసారి సప్పరాలు ధరించిన భక్తులు పెద్దఎత్తున కనిపించారు. నగరంలో ఎక్కడ చూసినా అంబళ్ల పంపిణీ, అన్నదాన వితరణ కార్యక్రమాలు విరివిగా జరిగాయి.మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూప స్థూపానికి అమ్మవారి విశ్వరూపం తయారు చేయడం మొదలుపెట్టారు. బుధవారం తెల్లవారుజామున చెంపనరుకుడుతో గంగజాతర పరిసమాప్తి కానుంది.





సప్పరంతో భక్తుడు

నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

వాగ్దేవి రూపంలో నృసింహుడు

రామావతారంలో హనుమంతుడిపై పెంచలస్వామి విహారం

డక్కిలి, మే 21 : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో స్వామివారు హంసవాహనంపై భక్తులను కటాక్షించారు.అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ, తిరుమంజనం నిర్వహించాక సేద తీర్చేందుకు 12 గంటలకు స్నపన తిరుమంజనం జరిపించారు.అనంతరం యాగశాలలో లక్ష్మీనారసింహ హోమం నిర్వహించారు.రాత్రి శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి బంగారు హనుమ వాహనంపై మాడ వీధుల్లో విహరించారు.బుధవారం గరుడవాహన సేవ జరగనుంది. నృసింహ స్వామి జయంతి కూడా కావడంతో ఈ వేడుకలను తిలకించడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులకోసం వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 120కి పైగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నారు.



సరస్వతీ దేవి అలంకరణలో స్వామి వారు



హనుమ వాహన సేవకు హాజరైన భక్తజనం

కౌంటింగు నాడు అల్లర్ల ముప్పు?

ఇంటెలిజన్స్ హెచ్చరికలతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), మే 21: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు రోజు, మరుసటి దినం జిల్లాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అదే తరహాలో జూన్ 4వతేది ఓట్ల లెక్కింపు రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం వుందని ఇంటెలిజన్స్ వర్గాలు హెచ్చరించాయి.ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, నడవలూరు, రామాపురం, బ్రాహ్మణకాల్వ, నెన్నూరు గ్రామాలతో పాటు తిరుపతిలోని ఎస్టీవీ నగర్, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ నగర్, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో అల్లర్ల ముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లర్లకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, పాత నేరస్తులను బైండోవర్ చేయించే పనిలోపడింది.కౌంటింగ్ పూర్తయిన వారం రోజుల పాటు ఈ పికెట్లు కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. అల్లర్లు జరిగే ప్రాంతాలకు త్వరితగతిన చేరుకునేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ టీములను సిద్ధం చేశారు. మరో వైపు ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చి

- సూళ్లూరుపేటలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం



ఎ.రంగంపేటలోని ఓ ఇంట్లో సోదాలు

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం పలుచోట్ల పోలీసులు కార్డన్ సెర్చి పేరిట తనిఖీలు చేపట్టారు.గత 13వ తేదీన పోలింగ్ రోజు, మరుసటి రోజు పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే.వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఆ సందర్భంగా కూడా హింస చెలరేగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తచర్యగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో గూడూరు పట్టణం గాంధీనగర్, ఇందిరానగర్, చవటపాలెం, టిడ్కో ఇళ్ల సముదాయం తదితర ప్రాంతాలను పోలీసు బలగాలు చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టాయి.ఉదయం 8గంటల నుంచీ 10గంటల వరకూ దాదాపు ఇల్లిల్లూ గాలించారు. సరైన పత్రాలు లేని మూడు ఆటోలు, 30 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూళ్ళూరుపేట పట్టణం సూళ్లూరు ప్రాంతాన్ని పోలీసులు కార్డన్ సెర్చిలో భాగంగా జల్లెడ పట్టారు. ఉదయం 6 గంటల నుంచీ 9 గంటల వరకూ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ ఇంట్లో రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఓ మహిళ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇక నాయుడుపేట పట్టణం ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో వేకువజామున 5.30 గంటల నుంచీ ఉదయం 7.30 గంటల వరకూ కార్డన్ సెర్చిలో భాగంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో దౌర్జన్యకర వాతావరణం నెలకొని వుంటుందని, గంజాయి అమ్మకాలు కూడా జరుగుతుంటాయని సమాచారం. అయితే పోలీసు తనిఖీల గురించి ముందే సమాచారం లీక్ కావడంతో అసాంఘిక శక్తులు అప్రమత్తమయ్యాయని, అందుకే అనుమానితులు ఎవరూ పట్టుబడలేదని తెలిసింది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట గ్రామంలో పోలీసు బలగాలు తెల్లవారుజామున 5 గంటల నుంచీ 7 గంటల వరకూ ఇల్లిల్లూ తనిఖీ చేశాయి. అయితే అనుమానితులు గానీ, ఇతరత్రా నిషేధిత వస్తువులు గానీ, పత్రాలు లేని వాహనాలు గానీ పట్టుబడలేదు.

ఎన్నికల కాలంలో తెగ తాగేశారు

రెండు నెలల్లో రూ.273 కోట్ల మద్యం వాడకం

తిరుపతి (నేరవిభాగం), మే 21 : సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను పార్టీలు మద్యం మత్తులో ముంచెత్తాయి. ముందుగానే తమిళనాడు మద్యాన్ని అక్రమంగా దిగుమతి చేసుకుని దాదాపు రెండు నెలల పాటు తిరుపతి, చంద్రగిరి, నాయుడుపేట,సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ఓటర్లతో పాటు ప్రచారం చేసిన కార్యకర్తలకు విచ్చలవిడిగా పంపిణీ చేశారు.మన జిల్లాలోని మద్యం షాపుల్లో అమ్మకాలతో తమిళనాడు నుంచి తరలించిన మద్యాన్ని కలుపుకుంటే దాదాపు రూ.273 కోట్ల విలువైన మద్యం ఈ రెండు నెలల్లో తాగించినట్లు అంచనా. మరో 83,339 కేసుల బీర్ల అమ్మకాలు కూడా జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ 21.11 కోట్ల ఆదాయం లభించింది.

కౌంటింగ్‌కు పరిశీలకుల నియామకం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వచ్చే నెల 4వ తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక కేడర్‌లకు చెందిన సీనియర్ అధికారులు జిల్లాలో పరిశీలకులుగా నియమితులయ్యారు. చంద్రగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌కే ప్రత్యేకించి ఒకరిని నియమించగా వెంకటగిరి, శ్రీకాళహస్తిలకు ఒకరు, సూళ్లూరుపేట, తిరుపతిలకు ఒకరు, గూడూరు, సత్యవేడులకు ఒకరు చొప్పున పరిశీలకులను ఈసీ నియమించింది.

నియోజకవర్గాల వారీగా పరిశీలకుల వివరాలు

నియోజకవర్గం	పరిశీలకుల పేరు	మొబైల్ నంబరు
చంద్రగిరి	కైలాష్ వాంఖెడే	9425101644
వెంకటగిరి, శ్రీకాళహస్తి	డాక్టర్ జ్యోత్స్న విద్యాసాగర్	9923021792
సూళ్లూరుపేట, తిరుపతి	ఉజ్వల్ కుమార్ ఘోష్	7338525461
గూడూరు, సత్యవేడు	కె.జ్యోతి	9900118421

నగరిదే తొలి ఫలితం

- ఈ నియోజకవర్గ బరిలో ఏడుగురు అభ్యర్థులే
- ఆ తర్వాత చిత్తూరు, పుంగనూరు ఫలితాలు
- ఆలస్యంగా 12గంటల ప్రాంతంలో పలమనేరు ఫలితం

చిత్తూరు కలెక్టరేట్, మే 21: ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడుతుండడంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. అటు అభ్యర్థులు, ఇటు ప్రజల్లోనూ ఒక్కటే పరిస్థితి. తాము గెలవాలని అభ్యర్థులు, ఓటేసిన అభ్యర్థి గెలవాలని ఓటర్లు నిత్యం జూన్ 4వ తేదీకోసం రోజులు లెక్కిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎన్నికలు జరిగిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలి ఫలితం వెలువడేది నగరిదే. ఇందుకు ప్రధాన కారణం.. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే నగరిలోనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ ఓటర్ల సంఖ్య 2,02,574. అందుకు తగ్గట్లే తక్కువగా 231 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో పోల్చితే ఒక రౌండ్ ముందుగానే ఓట్ల లెక్కింపు పూర్తయ్యి ఫలితం వెలువడనుంది. పైగా ఇక్కడ అభ్యర్థులు కేవలం ఏడుగురే కావడంతో ఈవీఎంలో ఓట్ల లెక్కింపులకు కూడా తక్కువ సమయం తీసుకుంటుంది. అందుకని పది గంటల ప్రాంతంలోనే ఫలితం రావొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏ పార్టీ అభ్యర్థి తొలుత జెండా ఎగురవేస్తారన్నది తేలిపోతుంది. ఇక, ఎనిమిది మంది అభ్యర్థులతో 265 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,38,868 మంది ఓటర్లున్న పుంగనూరు.. 13మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ అతి తక్కువగా 226 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,02,850 మంది ఓటర్లు ఉన్న కారణంగా చిత్తూరు ఫలితాలు కూడా ఆ తర్వాత 15 నిమిషాల వ్యవధిలో వెలువడనున్నాయి. ఇక, అత్యధిక (14 మంది) అభ్యర్థులు, 288 పోలింగ్ కేంద్రాలు, 2,67,896 మంది ఓటర్లు కలిగిన పలమనేరు నియోజకవర్గం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఫలితం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వెలువడొచ్చని అధికారులు అంటున్నారు. 11మంది అభ్యర్థులు, 256 పోలింగ్ కేంద్రాలు, 2,04,949 ఓటర్లు కలిగిన గంగాధరనెల్లూరు ఫలితాలు, 12 మంది అభ్యర్థులు, 262 పోలింగ్ కేంద్రాలు, 2,20,999 ఓటర్లు కల్గిన పూతలపట్టు ఫలితాలు, 13 మంది అభ్యర్థులు, 243 పోలింగ్ కేంద్రాలు, 2,25,775 ఓటర్లు కల్గిన కుప్పం ఫలితాలు సుమారు 11 గంటల మధ్య వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



కారులోపల వేలాడుతున్న బాల ఏసు ఫొటో

టీటీడీలో మరోసారి భద్రతావైఫల్యం

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవమత గుర్తులతో ఉన్న ఓ కారు తిరుమలకు రావడం విమర్శలకు దారి తీసింది. సాధారణంగా హిందూయేతర మతాలకు చెందిన గుర్తులు, కరపత్రాలు, స్టిక్కర్లతో వాహనాలు తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి టోల్‌గేట్‌లో జరిపే భద్రతా తనిఖీల్లోనే గుర్తించి తొలగించాలి. కానీ, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మంగళవారం టీఎస్ 19 ఏఎక్స్ 2772 నెంబరు గల కారు క్రైస్తవ మతానికి చెందిన ఫొటోతో తిరుమలకు వచ్చింది. మ్యూజియం వద్ద పార్కు చేసివున్న కారును గుర్తించిన స్థానికులు తిరుమల విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని కారులో ఆ గుర్తులను తొలగించారు.

మద్యానికి బానిసై మేస్త్రీ ఆత్మహత్య

పాకాల, మే 21: ఉరివేసుకొని మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పాకాల మండలం ఊట్లవారిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్‌బాబు కథనం మేరకు.. ఊట్లవారిపల్లెకు చెందిన టి.వెంకటేష్ (43) మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై గొడవలు పడి ఉరేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్

తిరుచానూరు, మే 21: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ధ్వజస్తంబానికి నమస్కరించి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారికి వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



ప్రైడే గార్డెన్‌లో పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

తిరుచానూరు, మే 21: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక వసంతోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6గంటల నుంచి పుణ్యాహవచనం, రక్షా బంధనం, అంకురార్పణ, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు ఆలయం సమీపంలోని ప్రైడే గార్డెన్‌లో పుట్టమన్ను సేకరించి ఆలయానికి తీసుకువచ్చి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజులపాటు వార్షిక వసంతోత్సవాలు జరగనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ప్రతిరోజూ అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. గురువారం ఉదయం స్వర్ణరథోత్సవం కన్నులపండువలా జరగనుంది. ఈ ఉత్సవాల కారణంగా బుధవారం నుంచి మూడు రోజులపాటు పలు ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నానీకి పరామర్శ



తిరుచానూరు, మే 21: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరామర్శించారు. మంగళవారం ఆయన నానీ ఇంటికి వెళ్లారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు తెగబడుతోందని పేర్కొన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

ఎ.రంగంపేటలో కార్డన్ సెర్చి



ఎ.రంగంపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు



చంద్రగిరిలో నిర్వహిస్తున్న ఫ్లాగ్‌మార్చ్

చంద్రగిరి, మే 21: సార్వత్రిక ఎన్నికల తరువాత చంద్రగిరి మండలం కూచువారిపల్లెలో జరిగిన హింసాత్మక ఘటనలతో పోలీసులు అలర్టయ్యారు.మంగళవారం ఉదయం 5 గంటలకు ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, 70 మంది పోలీసులతో ఎ.రంగంపేట గ్రామంలో సోదాలు జరిపారు.ఎన్నికల ఫలితాల తర్వాత గొడవలు జరిగే అవకాశముండడంతో ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆ ఇంట్లో ఉన్న వారి వివరాలు సేకరించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, దాడులు, ప్రతిదాడులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సాయంత్రం చంద్రగిరిలో సుమారు 70 మంది ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శ్రీహరి కోట నుంచి వచ్చిన ప్రత్యేక బలగాలకు చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. ఏ సమయంలో అయినా గొడవలు జరిగితే ఆ గ్రామానికి ప్రత్యేక బలగాలు వెళ్లనున్నట్లు సీఐ రామయ్య తెలిపారు.

కూచువారిపల్లెలో ఎస్పీ

పోలింగ్ తరువాత అల్లర్లు జరిగిన కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె గ్రామాలను తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం రాత్రి సందర్శించారు. అక్కడ పికెట్ నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సందేహం ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్తులతో రాజకీయ విషయాలు చర్చించకుండా ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ సమీపిస్తున్న క్రమంలో మండలంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.శాంతిభద్రతల ఏఎస్పీ కులశేఖర్, చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, ఎస్బీ సీఐ శ్రీనివాసులు, చంద్రగిరి సీఐ రామయ్య, సీఐఎస్ఎఫ్ సీఐ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రామిరెడ్డిపల్లెలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), మే 21: తిరుపతి-లింగంపల్లి- ముంబాయి మధ్య నడుస్తున్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ల(12733-12734, 17057-17058)కు అదనంగా రెండు 3ఏసీ కోచ్‌ను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 27వ తేదీవరకు ఈ అదనపు కోచ్‌లు ఉంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

వైభవంగా గంగ జాతర

భాకరాపేట, మే 21: చిన్నగొట్టిగల్లు మండలంలోని గ్రామాలలో మంగళవారం గంగ జాతరను వైభవంగా నిర్వహించుకున్నారు. తిరుపతి గంగమ్మకు ఉదయాన్నే అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేశారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి బోనాలు సమర్పించారు. రాగదీలు వెలిగించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



విశేషాలంకరణలో తిరుపతి గంగమ్మ

హనుమంత, గజ వాహనాలపై గోవిందుడి విహారం

తిరుపతి(కల్చరల్), మే 21: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఏడు గంటలకు హనుమంత వాహనంపై రామచంద్రుడి అలంకరణలో స్వామి వారు విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరగ్గా, రాత్రి ఏడు గంటలకు స్వామివారు గజవాహనంపై మాడవీధుల్లో వేచి ఉన్న భక్తులకు కనువిందు చేశారు. వాహనసేవముందు వేదపండితులు, జీయరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. వివిధ కళారూపాలు, నృత్యాలు, కోలాటాలు భక్తులను ఆకర్షించాయి. ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

నేటివాహనసేవలు : బుధవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహన సేవ జరుగుతుంది.



హనుమంత వాహనం



గజవాహనంపై గోవిందుడు





సాంస్కృతిక ప్రదర్శనలు

ఘనంగా తరిగొండ వెంగమాంబ జయంతి

తిరుపతి (కల్చరల్), మే 21: అన్నమాచార్య కళామందిరంలో వెంగమాంబ జయంతి వేడుకలు మంగళవారం మొదలయ్యాయి. ప్రారంభ సభలో పాల్గొన్న టీటీడీ జేఈవో గౌతమి మాట్లాడుతూ.. శ్రీవారిని సేవించిన వెంగమాంబ మనకు ఎనలేని సాహితీ సంపదను అందించారని చెప్పారు. అనంతరం జరిగిన సాహితీ సభకు విశ్రాంత ఉపకులపతి ఆచార్య కుసుమ కుమారి అధ్యక్షత వహించగా, పలు అంశాలపై ఎస్వీబీసీ అధ్యక్షుడు సాయికృష్ణ యాచేంద్ర, నెల్లూరుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ లోకేశ్వరి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ ప్రసంగించారు. అంతకుముందు శ్వేత సంచాలకుడు భూమన్ తదితరులు వెస్ట్ చర్చి కూడలిలోని తరిగొండ వెంగమాంబ విగ్రహానికి నివాళి అర్పించారు. సాయంత్రం సాయికృష్ణ యాచేంద్ర ఆధ్వర్యంలో వెంగమాంబ సంగీత గేయధార జరిగింది. తర్వాత శ్రీనిధి బృందం గాత్రకచేరి నిర్వహించారు. బుధవారం ఉదయం 10 గంటలకు సాహితీ సభ, సాయంత్రం సంగీత సభ ఉంటుంది.



వెంగమాంబ చిత్రపటానికి పుష్పాంజలి

నేడు తిరుమలలో జయంత్యుత్సవాలు

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): తరిగొండ వెంగమాంబ జయంత్యుత్సవాలు బుధవారం తిరుమలలో వైభవంగా జరగనున్నాయి. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారిణి బుల్లెమ్మ బృందం వెంగమాంబ సంకీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు.. తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్టిగానం నిర్వహిస్తారు. 7 గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద అనుగ్రహ భాషణం చేస్తారు.

తప్పు చేయకుండానే జైలుకు పంపించారు

అనుప్పల్లెవాసుల ఆవేదన



తిరుపతి(నేర విభాగం), మే 21: 'తప్పు చేయకుండానే మా వాళ్లను జైలుకు పంపించారు. పద్మావతి మహిళా వర్సిటీ ముందు నాని కారుపై దాడి చేసినప్పుడు మా వాళ్లు అక్కడ లేరు. అయినా పోలీసులు ఇంటికి వచ్చి బలవంతంగా తీసుకెళ్లారు' అని అనుప్పల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ హర్షవర్దన రాజును కలిసి వివరాలు తెలిపారు. దాడి జరిగినప్పుడు తమ వాళ్లు అక్కడ లేరని చెప్పడానికి బలమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఎస్పీ తమ ఆవేదన విని.. విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నానీపై జరిగిన దాడి కేసులో రామచంద్రాపురం మండలం అనుప్పల్లె పంచాయతీ గడ్డకిందపల్లెకి చెందిన ఎద్దుల భాస్కరరెడ్డి, సాంబశివారెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి, కడప జైలుకు తరలించారన్నారు. ఈ ఘటనలతో వారికి సంబంధంలేదని కుటుంబీకులు ఎంత చెప్పినా పోలీసులు వినకుండా కేసు పెట్టి జైలుకు పంపారని వాపోయారు. దాడి జరిగిన సమయంలో భాస్కరరెడ్డి ఎల్ఐసీ ఆఫీసులో ఉన్నట్లు అక్కడ సీసీ టీవీ ఫుటేజీ ఉందన్నారు. సాంబశివారెడ్డి ఇంటి వద్దే ఉన్నాడన్న ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఎస్పీని కలసినవారిలో భాస్కరరెడ్డి సోదరి సుమతి, సాంబశివారెడ్డి సతీమణి రోహిణితోపాటు ఇతర కుటుంబ సభ్యులున్నారు.

తిరుమలలో యువకుడి ఆత్మహత్య



తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. బీటైప్ క్వార్టర్స్ వెనుకభాగంలోని చెట్టుకు సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వగా వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించక పోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 96772 నెంబరు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బాటిళ్లలో పెట్రోల్ విక్రయం నిషేధం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మే 21: బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలను నిషేధించినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఓట్ల లెక్కింపు, శాంతిభద్రతలు, తాగునీరు తదితర అంశాలపై జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో ఓట్ల లెక్కింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. 144 సెక్షన్ అమల్లో భాగంగా మహిళా వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను నోడ్రోన్ ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించడం జరిగిందని తెలిపారు. నగరపాలక కమిషనర్ అదితిసింగ్, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా.. మము కరుణించమ్మా అంటూ ప్రజలు వేడుకున్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు మొదలు చిన్న పల్లెల వరకు పలుచోట్ల మంగళవారం గంగ జాతరలు నిర్వహించారు. చిత్తూరు, కుప్పంతో పాటు పలమనేరు, నగరి మండలం వీకేఆర్‌పురం, పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లి, గుడిపాల మండలం 197 రామాపురం, పూతలపట్టు, పులిచెర్ల మండలం కల్లూరు, జీడీనెల్లూరు దళితవాడతోపాటు పలు గ్రామాల్లో గంగమ్మ జాతర జరిగింది. కొన్ని చోట్ల అంబలి పోసి.. మరికొన్ని చోట్ల జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



చిత్తూరులో నడివీధి గంగమ్మ విశ్వరూప దర్శనం

కుప్పం.. పోటెత్తిన భక్తజనం

అమ్మవారి ఖండిత శిరస్సు ఊరేగింపునకు పోటెత్తిన భక్తజనం

కుప్పంలో శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు జనం పోటెత్తారు. అమ్మవారి ఖండిత శిరస్సు ఊరేగింపులో ఇసుకేస్తే రాలనంతగా జనం పాల్గొన్నారు. మంగళవారం ఉదయం గంగబావి దగ్గర వంశపారంపర్య పూజారులు అమ్మవారి శిరస్సుకు పూజలు నిర్వహించారు. అమ్మవారి కండ తెర తొలగించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అక్కడినుంచి అమ్మవారి శిరస్సు ఊరేగింపు ప్రారంభమైంది. గంగమ్మ ముందు, వెనుకల భక్తజనం అనుసరిస్తుండగా, పచ్చ గరిగె మున్ముందు సాగుతుండగా ఊరేగింపు వైభవోపేతమై కనిపించింది. గంగమ్మ శిరస్సు ఊరేగింపు నేతాజీరోడ్డు చివరకు చేరుతుండగా వాన ప్రారంభమైంది. అయినా జనం లెక్కచేయలేదు. వీధులలోనూ, ఇళ్ల వద్దా నిలబడి అమ్మను దర్శించుకున్నారు. జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మొదలైన అమ్మవారి శిరస్సు ఊరేగింపు, అర్ధరాత్రి దాటేవరకు కొనసాగి, చివరకు ఆలయానికి చేరుకుంది. మొక్కులున్న భక్తులు వివిధానేక వేషాలు వేసుకుని అమ్మవారి శిరస్సును దర్శనం చేసుకున్నారు. కాగా, మొండెంతో తెర వెనుకనే ఉండిపోయిన అమ్మవారు, ఈ జాతర వారం రోజులుగా తెర ముందుకు వచ్చి శిరస్సు భాగంలో వేపమండలు ధరించి పూజలందుకున్నారు. కాగా, మంగళవారమంతా ఊరేగింపుగా సాగిన అమ్మవారి ఖండిత శిరస్సు.. ఆలయానికి చేరుకోగానే శాంతిపూజలు నిర్వహిస్తారు. అనంతరం శిరస్సును అమ్మవారి అసంపూర్ణ దేహంపై అమరుస్తారు. ఇలా.. బుధవారం భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శనం కల్పిస్తారు. దీంతో రెండు రోజుల కుప్పం జాతర ముగుస్తుంది. జాతర సందర్భంగా కుప్పంలో ఎటు చూసినా భక్తజనమే కనిపిస్తున్నారు.

- కుప్పం

చిత్తూరులో వైభవోపేతం

అంబలి బిందెలను నెత్తిన పట్టుకుని.. వేపాకు చుట్టుకుని భక్తులు మంగళవారం చిత్తూరులోని నడివీధి గంగమ్మను దర్శించుకున్నారు. ఇలా వచ్చే భక్తులతో నగరంలో గంగజాతర సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల్లోనూ అమ్మవార్లను కొలువుదీర్చి.. జాతర నిర్వహించారు. గంగజాతర సందర్భంగా వీధులన్నీ వేపాకు తోరణాలతో కళకళలాడాయి. ఈ గంగజాతర గత వారం జరగాల్సి ఉంది. అయితే, ఎన్నికల నేపథ్యంలో ఈ వారం నిర్వహిస్తున్నారు. వేకువజామున వంశ పారంపర్య ధర్మకర్తలు సీకే బాబు కుటుంబీకులు పొన్నియమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి నడివీధి గంగమ్మకు మంగళహారతి ఇచ్చారు. అమ్మవారి ముసుగు తీసి భక్తులకు దర్శనం కల్పించారు. సీకేబాబు దంపతుల తొలిపూజతో జాతర మొదలైంది. అమ్మవారికి మేకను బలిచ్చి ఆ రక్తాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వందలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని అంబలి నైవేద్యాన్ని సమర్పించారు. ప్రత్యేక బెల్లం పాగు పెనాలలో నింపిన అంబలిని పరిసర మండలాల రైతులు ఎప్పటి కప్పుడు బిందెలతో తీసుకెళ్లారు. తమ పొలాల్లో అంబలిని చల్లి ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఇక, ఉత్సవ ధర్మకర్త సీకే లావణ్య అమ్మవారి పసుపు కుంకుమను భక్తులకు పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనానికి

- చిత్తూరు కల్చరల్



కాళికాదేవి వేషంలో..



బెల్లంపాగు పెనాల్లో అమ్మవారికి నైవేద్యంగా అంబలి సమర్పణ




గంగమ్మకు హారతి



ఆలయం వెలుపల, లోపల భక్తుల రద్దీ


క్యూల్లో వేచి ఉన్న భక్తులు

మము కరుణించు గంగమ్మా..!


పొర్లుదండాలు పెడుతున్న భక్తులు




భక్తుల మధ్య తోక్కిసలాట



తిరుపతి(కల్చరల్), మే 21: మము కరుణించు గంగమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు. జాతరను పురస్కరించుకుని సోమవారం అర్ధరాత్రి తర్వాత తాతయ్యగుంట గంగమ్మ మూలవిరాట్‌కు మహాభిషేకం చేసి, శాంతింపచేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణతోపాటు వజ్రకిరీటధారణ చేశారు. అప్పటికే అమ్మవారి అభిషేకానంతర దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో వేచి ఉన్నారు. మంగళవారం తెల్లవారు జామున నాలుగు గంటల పైన భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి అభిషేక పసుపు, కుంకుమ, పూలు, నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. పురుషులు పలురకాల విచిత్ర వేషధారణలతో పాటు, మహిళలు కొందరు వేపాకు చీరలు కట్టుకుని, మరి కొందరు సప్పరాలు ధరించి అమ్మవారి ఆలయ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్ రెడ్డి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌తోపాటు పలువురు అధికారులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.







వేశాలమ్మ


సప్పరంతో భక్తుడు




దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి - కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ - భక్తులకు అన్నదానం చేస్తున్న మేయర్ శిరీష, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

ఆకట్టుకున్న గంగమ్మ నాటకం

గంగ జాతర సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇందిరా మైదానంలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న గంగమ్మ నాటక ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. బీఎన్ రెడ్డి దర్శకత్వం వహించిన నాటకానికి గంగమ్మ పాత్రధారిగా ప్రముఖ భరతనాట్య కళాకారిణి శైలజా రెడ్డి, పాలెగాడిగా ప్రముఖ రంగస్థల నటుడు మర్ధం గజేంద్రతోపాటు సదరన్ డిస్కం ఎస్ఈ కృష్ణారెడ్డి, పలువురు ఉద్యోగులు కూడా నటించి నాటకాన్ని రక్తికట్టించారు.




చివరిది పేరంటాల వేషం

మంగళవారం అర్ధరాత్రి తర్వాత అనువంశికంగా కైకాల వంశస్తులు మాత్రమే పేరంటాల వేషం వేస్తారు. ఈ వేషంతోపాటుగా గడ్డితో రూపొందించిన బండిపీనుగను (పాలెగాని పీనుగ) పేరంటాల వేషంలోని వ్యక్తి నిప్పుపెట్టగా, పాలెగాడు అంతమైనట్లు ప్రజలు పండగ చేసుకున్నారు. ఈప్రక్రియ పూర్తికాగానే జాతర ముగిసినట్టు.

గంగమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి

అమ్మవారికి సారె సమర్పించిన ఆరణి


టీడీపీ నేతలు, కుటుంబీకులతో ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. గంగ జాతర సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులతో కలసి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వచ్చి సారె సమర్పించారు. ఆయనతో పాటు గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, కంకణాల రజినీకాంత్ నాయుడు, చింతా భరణి యాదవ్, చిన్ని, దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నెలవాయి మురళీకృష్ణ తదితరులున్నారు.

అమ్మకు పొంగళ్లు.. భక్తులకు అంబళ్లు

గంగజాతర అంటేనే పొంగళ్లు పెట్టడం.. అంబళ్లు పోయడం ప్రధాన ఆచారం. ఇందులో భాగంగానే మంగళవారం వేకువజామునుంచే మహిళా భక్తులు పొంగళ్లకు కావాల్సిన వస్తువులను బుట్టలో పెట్టుకుని ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ఆలయ అధికారులు పొంగళ్లు పెట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్ వద్ద భక్తులు పొంగళ్లు పొంగించి, అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు. ఇక ఇంటినుంచి తెచ్చుకున్న అంబళ్లను నైవేద్యంగా అందజేశారు. భక్తులు సమర్పించే పొంగళ్ల నైవేద్యాలు, జంతుబలుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో నగర పాలకసంస్థకు చెందిన పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమించారు. మూడు షిఫ్టుల్లో వంద మందికిపైగా నిర్విరామంగా శ్రమించి, వ్యర్థాలను తరలించారు. ఆలయ ఈవో మమత, ఉత్సవ అధికారి రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.40 కోట్లు

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.40 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 85,825 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 36,146 మంది తలనీలాలు సమర్పించారు.

ఎఫ్ఆర్‌టీఐ నేషనల్ జాయింట్ సెక్రటరీగా అజయ్



తిరుపతి అర్బన్, మే 21: ఫోరమ్ ఫర్ ఆర్టీఐ (ఎఫ్ఆర్‌టీఐ) నేషనల్ జాయింట్ సెక్రటరీగా తిరుపతికి చెందిన అజయ్ ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ కమిటీలో అజయ్‌కు చోటు లభించడం పట్ల పలువురు అభినందించారు.

సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా చీర్లకిరణ్



తిరుపతి అర్బన్, మే 21: ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన టీటీడీ ఉద్యోగి చీర్లకిరణ్ నియమితులయ్యారు. విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్నేహితులు, కుటుంబీకులు అభినందనలు తెలిపారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

తిరుపతి(కపిలతీర్థం), మే 21: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు యార్లపల్లి గోపి, ఎన్ఎస్‌యూఐ తిరుపతి అధ్యక్షుడు షేక్ జావేద్, కాంగ్రెస్ నేతలు వెంకటేష్‌గౌడ్, భానుప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు

డీఎస్పీ రవిమనోహరాచారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), మే 21: తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, అలిపిరి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, సంఘ విద్రోహక శక్తులకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా సిబ్బంది సహకరించాలన్నారు. అలాగే అలిపిరి సీఐగా రామారావు మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, పెదకూరపాడు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు

ఎస్పీ హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), మే 21: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలసి మహిళా వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కౌంటింగ్ రోజున వర్సిటీ పరిసర ప్రాంతాలు 500 మీటర్ల వరకు 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని అన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ వాహనాల రాకపోకలను ఇప్పటినుంచే పూర్తిగా నిషేధించాలని ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్‌ను ఆదేశించారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలు, దాడులు, ప్రతి దాడులు జరగకుండా అన్ని ప్రాంతాల్లో గస్తీ పెట్టాలని చెప్పారు. సంఘ వ్యతిరేక శక్తులను అదుపులోకి తీసుకుని, కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈసారి కౌంటింగ్ తర్వాత ఎక్కడ అల్లర్లు, కొట్లాటలు, విధ్వంసాలు జరిగినా దానికి సంబంధిత స్టేషన్ల సీఐలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంతటివారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

స్టేషన్లు తనిఖీ చేసిన ఎస్పీ

ఎస్వీయూ క్యాంపస్, వెస్ట్, అలిపిరి పోలీసు స్టేషన్, శాంతి భద్రతల అదనపు ఎస్పీ కార్యాలయం, ఈస్ట్ స్టేషన్, తిరుపతి డీఎస్పీ కార్యాలయాలను ఎస్పీ మంగళవారం తనిఖీ చేశారు. ప్రధానంగా రిసెప్షన్ కౌంటర్లతోపాటు కంప్యూటర్, ఎస్‌హెచ్‌వో, ఇతర గదులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీలు రవిమనోహరాచారి, సీఐలు పాల్గొన్నారు.

సదరన్ డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్‌కు అభినందనలు



తిరుపతి(ఆటోనగర్), మే 21: ఏపీ సదరన్ డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమితులైన వై.లక్ష్మీనరసయ్యకు మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అభినందనలు తెలిపిన వారిలో.. బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం డిస్కం కార్యదర్శి ఎల్.చలపతి, సీవీ వేణు, జగదీష్, మోహన్, కరీముల్లాఖాన్, మధు, రంగనాథం, మధుసూదన్ తదితరులున్నారు.

ముగ్గురు సీఎంవోలకు మెమో

తిరుపతి(వైద్యం), మే 21: అత్యవసర విభాగానికి తీసుకొచ్చిన ఓ రోగికి వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విషయంపై 'రుయాలో అందని అత్యవసర వైద్యం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సీఎంవో(క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్స్)లకు మెమో జారీ చేశారు. ఆస్పత్రిలో రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా, రోగిని నిర్లక్ష్యంగా బయటకు పంపేయడంపై అధికారులకు సమాచారం ఇచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై సీఎంవోలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటినుంచి సీపీఎం స్టడీ క్యాంపు

తిరుపతి అర్బన్, మే 21: సీపీఎం జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో బుధవారం నుంచి స్టడీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీవరకు ఎనిమిది రోజులపాటు జరిగే ఈ స్టడీ క్యాంపునకు జిల్లా నలుమూలల నుంచి నాయకత్వం హాజరవుతోంది. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ స్టడీ క్యాంపులో చర్చించనున్నారు. ఉదయం 11గంటలకు వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభంకానుంది. ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, వెంకటేశ్వర్లు హాజరవుతున్నారు.

ఇంటర్ అడ్వాన్స్డ్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

48 కేంద్రాలకు హాజరుకానున్న 18,512 మంది విద్యార్థులు: ఆర్ఐవో


ప్రసంగిస్తున్న ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 21: ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో అవకతవకలకు చోటులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని పద్మావతి బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం సీఎస్, ఏసీఎస్, కస్టోడియన్లతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈనెల24నుంచి వచ్చేనెల ఒకటో తేదీవరకు జరిగే పరీక్షల కోసం జిల్లాలో 48కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ ఇంటర్‌లో 15,880మంది, ద్వితీయలో 2,632మంది విద్యార్థులచొప్పున మొత్తం 18,512మంది హాజరుకానున్నారని చెప్పారు. మంగళవారం ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన ప్రశ్నపత్రాలు జిల్లాకు రాగా, పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచామని వివరించారు. డీవీఈవో విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, రఘుపతి, తులసీరామిరెడ్డి పాల్గొన్నారు.

అన్ని సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో వాల్యుయేషన్

ఒకేషనల్‌తోపాటు జనరల్ విభాగానికి చెందిన అన్ని సబ్జెక్టులను ఆన్‌లైన్‌లో వాల్యుయేషన్ చేసేలా ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టిందని ఆర్ఐవో తెలిపారు.

రేపటినుంచి అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తిరుపతి (కల్చరల్), మే 21: శ్రీవారి పరమ భక్తుడైన అన్నమాచార్యుల జయంతి వేడుకలను గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో రోజూ సాహిత్య సభలు, సంకీర్తనా గానం ఉంటుంది. వారంపాటు జరిగే సంగీత, సాహిత్య సభల్లో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, డాక్టర్ పంతుల రమ, పడలి ఫణి నారాయణ, టీఎం నాగమణి, సాయిపద్మజ, ఆచార్య కుసుమకుమారి, ఆచార్య రాణి సదాశివ మూర్తి, ఆచార్య కె.సర్వోత్తమన్, వాడ్రేవు చిన వీరభద్రుడు, శలకా రఘునాథ శర్మ, భూమన్, పేట శ్రీనివాసులు రెడ్డి, ఆముదాలమురళి, డాక్టర్ యువశ్రీ వంటి సాహితీవేత్తలు పాల్గొని, ప్రసంగిస్తారు.

వాళ్లు కోళ్లు పంచితే మీకేమి అభ్యంతరం!

విచారణ అధికారుల తీరుపై గ్రామస్తుల విస్మయం

సూళ్లూరుపేట, మే 21: ఎన్నికలకు రెండు రోజుల ముందు గ్రామంలో ఓటర్లకు నగదు పంచారంట కదా అధికార పార్టీ నాయకులు కోళ్లు పంచితే తప్పేమేటి అంటూ విచారణకు వెళ్లిన అధికారులు గ్రామస్తులను సంబంధం లేని ప్రశ్నలడిగినట్లు తెలిసింది. మండల పరిధిలోని మంగానెల్లూరులో పోలింగ్ ముందు రోజు అధికార పార్టీ నాయకులు కోళ్ల పంపిణీపై సర్పంచ్ కె.శేఖర్ ఫిర్యాదుతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి వి.రాజారెడ్డితో పాటు ఎస్ఐ రహీం రెడ్డి, ఏఎస్ఐలు రమణయ్య, రామ్మూర్తి గ్రామంలో విచారణ చేపట్టారు. పోలీసులు అవసరం లేకున్నా అధికారులు వారిని వెంటబెట్టుకొని వెళ్లారు. విచారణ సమయంలో పోలీసులు కొందరితో టీడీపీ వాళ్లు నగదు పంపిణీ చేశారంటా కదా అంటూ గ్రామస్తులను పదేపదే అడగడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు జి.నారాయణ రెడ్డి, మాట్లాడుతూ... తాము ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్లు ఆధారాలుంటే కేసులు పెట్టి చర్యలు తీసుకోండంటూ పోలీసులకు తెలిపారు. కోళ్ల పంపిణీ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. తూతూమంత్రంగా విచారణ చేసిన పంచాయతీ కార్యదర్శి పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు



గూడూరు అర్బన్, మే 21: రాపూరు మండలం పెంచల కోనలో జరుగుతున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు గూడూరు నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి భక్తులు పెంచలకోనకు వెళ్తుంటారు. డిపో నుంచి బుధ, గురువారాల్లో 8 సర్వీసులను నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికా రులు తెలిపారు. గరుడోత్సవం, కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తుంటారు. ఈక్రమంలో ఈనెల 22న జరిగే గరుడోత్సవానికి బస్సులు నడుపుతున్నారు. గూడూరు నుంచి పెంచలకోనకు రూ.115, సైదాపురం నుంచి రూ.90గా నిర్ణయించారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది



అవార్డులతో మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, మే 21: ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందని మయూరి శ్యామ్‌యాదవ్ తెలిపారు. శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, డీఆర్‌యూసీసీ సభ్యుడిగా, రోటరీక్లబ్ సభ్యుడిగా తాను కొవిడ్ సమయంలో చేసిన పలు సామాజిక, సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు అందించారన్నారు. అవార్డును అందజేసినందుకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేంద్రగౌడ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జోరందుకున్న బెట్టింగులు

చిట్టమూరు, మే 21: ఎన్నికల ఫలితాల అంచనాలపై పలు చోట్ల బెట్టింగులు జోరుగా సాతున్నాయి. మండల కేంద్రమైన చిట్టమూరులో రూ.లక్షల్లో బెట్టింగ్‌ల పర్వం చాపకింద నీరులా సాగుతోంది. రూ.పది వేల నుంచి లక్ష వరకు బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. ఓ వైపు ట్వంటీ20 క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్, మరో వైపు ఎన్నికల ఫలితాలపైన బెట్టింగ్ జోరు ఎక్కువైంది. దీంతో మండలంలో ఇటీవల ఒక వర్గం తమ పార్టీనే గెలుస్తుందని బెట్టింగ్‌లకు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడడంతో ఇరు పార్టీల మధ్య వివాదం చెలరేగింది. ఇలా ఎవరికి తగ్గట్టు వారు బెట్టింగ్‌లు పెట్టుకొని మధ్యవర్తుల వద్ద నగదును ఉంచుతున్నట్లు తెలిసింది. కొందరు మద్యంబాబులు కూడా క్వార్టర్ బాటిల్ నుంచి ఫుల్ బాటిల్ వరకు బెట్టింగ్ పెట్టుకోవడం గమనార్హం.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు



కోట, మే 21: కోట పోలీస్ స్టేషన్‌కు మంగళవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రశ్న పత్రాలు చేరాయి. ఈ మేరకు ఒకే షనల్ కోర్సుకు సం బంధించిన ప్రశ్నపత్రాలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కోటలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులం, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలల పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ తరగతులు



కేడెట్లకు జ్ఞాపిక అందజేస్తున్న విజయకుమార్ రెడ్డి

కోట, మే 21: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ నావెల్ రింగ్ కేడెట్లకు జరిగిన శిక్షణ తరగతులు మం గళవారం పూర్తయ్యాయి. కేడెట్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అభినందిం చారు. మూడేళ్లుగా కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అన్ని సాంఘిక కార్యక్ర మాల్లో ఎన్‌సీసీ నావెల్ రింగ్ కేడెట్ల భాగస్వామ్యం అభినందనీయమని విజయకుమార్‌రెడ్డి అన్నారు. అదే విధంగా ఎన్‌సీసీ నావెల్ రింగ్ క్యాడెట్ కెప్టెన్ పెన్నా లౌక్య, క్యాడెట్ కెప్టెన్ భార్గవ్, శ్రీహరి, జోష్‌వర్ధన్‌ను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం 2వ బ్యాచ్ కేడెట్ల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల సంతాపం



భాస్కర్ రెడ్డి మృతదేహం

డక్కిలి, మే 21: టీడీపీ నాయకుడు, పెంచల కోన ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు చెలికం భాస్కరరెడ్డి మంగళవారం గుండెపోటుతో మరణించారు. ముప్పై ఏళ్లుగా ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న ఆయన గతంలో నేదురుమల్లి జనార్దన రెడ్డి ముఖ్య అనుచరుడు. డక్కిలి ఆసుపత్రి సలహా కమిటీ చైర్మన్‌గా వ్యవ హరించారు. ఇటీవల టీడీపీలో చేరి కురుగొండ్ల రామకృష్ణ కోసం పనిచేశారు. భాస్కరరెడ్డి మృతి చెందాడని తెలియగానే తాను దిగ్భ్రాంతికి లోనైనట్లు కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కుటుంబసభ్యులను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. ఆయన మృతి పట్ల టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు సంతాపం వెలిబుచ్చారు. టీడీపీ శ్రేణులు భాస్కరరెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళి అర్పిం చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, పి.వెంకటరెడ్డి తమ సంతాపాన్ని తెలిపారు.

ముగ్గురు సీఎంవోలకు మెమో

తిరుపతి(వైద్యం), మే 21: అత్యవసర విభాగానికి తీసుకొచ్చిన ఓ రోగికి వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విషయంపై 'రుయాలో అందని అత్యవసర వైద్యం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సీఎంవో(క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్స్)లకు మెమో జారీ చేశారు. ఆస్పత్రిలో రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా, రోగిని నిర్లక్ష్యంగా బయటకు పంపేయడంపై అధికారులకు సమాచారం ఇచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై సీఎంవోలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అధ్వానంగా పార్కులు.. పట్టించుకోని అధికారులు



పోలిశెట్టి గుంట పార్కులో అధ్వానంగా ఉన్న పరిసరాలు - అధ్వానంగా ఉన్న కుమ్మరిగుంట పార్కు - మున్సిపల్ పార్కులో దుస్థితికి చేరుకున్న సిమెంటు బల్ల

వెంకటగిరి టౌన్, మే 21: మానసిక ఒత్తిడి నుంచి కొంతసేపైనా సేద తీరేందుకు వేదిక అవసరం. అయితే ఆహ్లాదకరమైన క్షణాలను గడిపేందుకు వెంకటగిరి పట్టణంలో పార్కులు అనువుగా లేకపోవడం వల్ల స్థానికులు ఆ వాతావరణానికి దూరమవుతున్నారు.

దశాబ్దాల క్రితం పట్టణానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గాంధీ పార్కు, లక్ష్మీ పార్కు శిథిలావస్థకు చేరాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టిన పార్కు నిర్వహణను మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులకు ఆటపాటలు, పెద్దల వ్యాహ్యాళికి ఉపయోగపడిన పార్కులు దుస్థితికి చేరాయి.

దుస్థితికి చేరిన పార్కులు...

త్రిభువని సెంటర్‌లో ఉన్న లక్ష్మీ పార్కు కనుమరుగైంది. తూర్పువీధిలో ఉన్న గాంధీజీ పార్కును 1948లో అప్పటి మద్రాసు స్థానిక స్వపరిపాలన మంత్రి కె.చంద్రమౌళి ప్రారంభించారు. నేడు పార్కు ప్రహరి కూలిపోయి దుస్థితిలో ఉన్నా అధికారులు మరమ్మతులకు చర్యలు చేపట్టలేదు. ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేస్తుండడంతో పార్కు పూర్తిగా మూసుకుపోయింది. వెంకటగిరి మున్సిపాలిటీ అయిన తరువాత కుమ్మరిగుంట వద్ద పార్కును ఏర్పాటు చేసేందుకు రూ.10లక్షలు ఖర్చుచేశారు. కొంతకాలం బోటు షికారు ఏర్పాటు చేశారు. అనంతరం బోటుషికారు ఎత్తివేయగా ప్ర స్తుతం దుస్థితిలో ఉంది. ఈ పార్కులో కూర్చు నేందుకు ఏర్పాటు చేసిన బల్లలు దెబ్బతింటున్నాయి. స్థానిక విద్యార్థులు చదువుకునేందుకు ఎక్కువగా ఈ పార్కును ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో ముళ్ల పొదలు, చెట్టుపుట్ట పెరిగిపోవడంతో విషసర్పాల బెడద ఉందని విద్యార్థులు తెలిపారు. పోలిశెట్టిగుంట వద్ద రూ.20లక్షలతో పార్కును ఏర్పాటు చేశారు. అయితే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో నామమాత్రంగా ఉం టోంది.

ఎమ్మెల్యే సస్పెన్షన్‌తో...

కుమ్మరిగుంట వద్ద పార్కును అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే ఆనం ఆధ్వర్యంలో రూ.1.20కోట్లతో గత అక్టోబరులో శిలాఫలకం నాటారు. కుమ్మరిగుంట వద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది జనవరిలో ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పనులు ఆగిపోయాయి.

అనుమానితులపై సమాచారం ఇవ్వండి

పలు ప్రాంతాల్లో డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చి



ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో సూచనలు ఇస్తున్న నాయుడుపేట డీఎస్పీ - స్వాధీనం చేసుకున్న వాహనాలతో సూళ్లూరుపేట పోలీసులు

గూడూరు, మే 21: తమ ప్రాంతాల్లో కొత్తవ్యక్తులు సంచరిస్తున్నా, అనుమానిత వాహనాలున్నా వెంటనే సమాచారం అందించాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్, ప్రశాంతినగర్, ఇందిరమ్మకాలనీ, టిడ్కో గృహ సముదాయ ప్రాంతాల్లో పోలీసులు కార్డన్‌సెర్చి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా తీవ్రతరం చేశామన్నారు. బయటప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ తలదాచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో పోలీసుల పహారా కొనసాగుతుందన్నారు. అనంతరం పలు వాహనాలు తనిఖీ చేసి రికార్డుల్లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సీఐలు రవికిరణ్, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐలు మనోజ్‌కుమార్, అంజిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఆర్‌కాలనీలో వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ఘర్షణలకు దిగితే కఠినచర్యలు తప్పవన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

తడ: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ నరసింహారావు తెలిపారు. మంగళవారం తడ బజారుకూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వాహనాలను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చి నిర్వహించారు. సీఐ మధుబాబు, ఎస్ఐ రహీంరెడ్డి సిబ్బందితో ప్రతి ఇంటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 7 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జూన్ 6 వరకు పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు.

రెండున్నర కిలోల గంజాయి

సూళ్లూరులో కార్డన్ సెర్చిలో ఓ ఇంట్లో గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని మహిళ సహా మరో ఇద్దరూ యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కానీ గంజాయి స్వాధీనం చేసుకున్న విషయాన్ని పోలీసులు బటయకు పొక్కనీయకుండా రహస్యంగా ఉంచారు.



వాహన సేవల్లో అలరించిన నృత్య ప్రదర్శనలు

హనుమంత, గజ వాహనాలపై గోవిందుడి విహారం



హనుమంత, గజవాహనాలపై గోవిందుడు

తిరుపతి(కల్చరల్), మే 21: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఏడు గంటలకు హనుమంత వాహనంపై రామచంద్రుడి అలంకరణలో స్వామివారు విహరించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఆలయంలో వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరగ్గా, రాత్రి ఏడు గంటలకు స్వామివారు గజవాహనంపై మాడవీధుల్లో వేచి ఉన్న భక్తులకు కనువిందు చేశారు. వాహనసేవముందు వేదపండితులు, జీయరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. వివిధ కళారూపాలు, నృత్యాలు, కోలాటాలు భక్తులను ఆకర్షించాయి. ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

నేటివాహనసేవలు

బుధవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహన సేవ జరుగుతుంది.

నేటినుంచి సీపీఎం స్టడీ క్యాంపు

తిరుపతి అర్బన్, మే 21: సీపీఎం జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో బుధవారం నుంచి స్టడీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీవరకు ఎనిమిది రోజులపాటు జరిగే ఈ స్టడీ క్యాంపునకు జిల్లా నలుమూలల నుంచి నాయకత్వం హాజరవుతోంది. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ స్టడీ క్యాంపులో చర్చించనున్నారు. ఉదయం 11గంటలకు వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభంకానుంది. ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, వెంకటేశ్వర్లు హాజరవుతున్నారు.

రేపటినుంచి తిరుపతి, రాజంపేట, తాళ్లపాకల్లో అన్నమయ్య జయంతి ఉత్సవాలు

తిరుపతి (కల్చరల్), మే 21: శ్రీవారి పరమ భక్తుడైన అన్నమాచార్యుల జయంతి వేడుకలను గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి, తాళ్లపాక, రాజంపేటల్లోని మూడు వేదికలపై ఈ వేడుకలు జరుగుతాయి. కాగా, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో రోజూ ఉదయం సాహిత్య సభలు, సాయంత్రం సంకీర్తనా గానం ఉంటుంది. వారంపాటు జరిగే సంగీత, సాహిత్య సభల్లో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, డాక్టర్ పంతుల రమ, పడలి ఫణి నారాయణ, టీఎం నాగమణి, సాయిపద్మజ వంటి సంగీతకారులు, ఆచార్య కుసుమకుమారి, ఆచార్య రాణి సదాశివ మూర్తి, ఆచార్య కె.సర్వోత్తమన్, వాడ్రేవు చిన వీరభద్రుడు, శలాకా రఘునాథ శర్మ, భూమన్, పేట శ్రీనివాసులు రెడ్డి, ఆముదాలమురళి, డాక్టర్ యువశ్రీ వంటి సాహితీవేత్తలు పాల్గొని, ప్రసంగిస్తారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు: ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), మే 21: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హర్షవర్దనరాజు హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలసి మహిళా వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కౌంటింగ్ రోజున వర్సిటీ పరిసర ప్రాంతాలు 500 మీటర్ల వరకు 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని అన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ వాహనాల రాకపోకలను ఇప్పటినుంచే పూర్తిగా నిషేధించాలని ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్‌ను ఆదేశించారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలు, దాడులు, ప్రతి దాడులు జరగకుండా అన్ని ప్రాంతాల్లో గస్తీ పెట్టాలని చెప్పారు. సంఘ వ్యతిరేక శక్తులను అదుపులోకి తీసుకుని, కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఈసారి కౌంటింగ్ తర్వాత ఎక్కడ అల్లర్లు, కొట్లాటలు, విధ్వంసాలు జరిగినా దానికి సంబంధిత స్టేషన్ల సీఐలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంతటి వారైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

స్టేషన్లు తనిఖీ చేసిన ఎస్పీ

ఎస్వీయూ క్యాంపస్, వెస్ట్, అలిపిరి పోలీసు స్టేషన్, శాంతి భద్రతల అదనపు ఎస్పీ కార్యాలయం, ఈస్ట్ స్టేషన్, తిరుపతి డీఎస్పీ కార్యాలయాలను ఎస్పీ మంగళవారం తనిఖీ చేశారు. ప్రధానంగా రిసెప్షన్ కౌంటర్లతోపాటు కంప్యూటర్, ఎస్‌హెచ్‌వో, ఇతర గదులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీలు రవిమనోహరాచారి, సీఐలు పాల్గొన్నారు.

కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



నాయుడుపేట టౌన్, మే 21: పట్టణ సమీపంలోని తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ ఘట్టాన్ని ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై కరిమాణిక్యస్వామి విహరించి భక్తులను కటాక్షించారు.

పోలేరమ్మకు వెండికవచం బహూకరణ



నాయుడుపేట టౌన్, మే 21: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద కొలువై ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి నాయుడుపేటకు చెందిన అంకమ్మ వెండి కవచం అందజేశారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం వెండి కవచాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో బాబు, పూజారి గణపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి హనుమంతవాహనసేవ



చిల్లకూరు, మే 21: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ స్వా మి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, పలు ప్రత్యేకపూజలను నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హను మంత వాహనంపై అధిష్ఠింపజేసి విశేషపూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

విజయదుర్గాదేవికి హోమ పూజలు



గూడూరు అర్బన్, మే 21: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో మంగళవారం అమ్మవారికి హోమపూజలు నిర్వహించారు. ఈ ఉప పీఠంలో అమ్మవారికి శ్రీచక్ర ప్రతిష్ఠ జరిపి 16 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మహామృత్యుంజయ అమృత పాశుపత మహా రుద్రాభిషేక హోమం జరిపారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామికి శత్రుసంహార త్రిసతిహోమాన్ని శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఏపీడీ విచారణ



ఉపాధి కూలీలను విచారిస్తున్న ఏపీడీ

పెళ్లకూరు, మే 21 : మండలంలోని శిరసనంబేడులో ఉపాధి హామీ పథక పనుల్లో జరిగిన అక్రమాలపై మంగళవారం డ్వామా ఏపీడీ రవికుమార్ నాయుడు విచారణ చేపట్టారు. వారం రోజులు ఉపాధి పనులు చేస్తే మూడు రోజులకు మాత్రమే కూలి చెల్లిస్తున్నారని మిగిలిన మూడు రోజులు పనికి హాజరుకాని వారి పేర్లను మస్టర్లలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున్ నమోదు చేస్తున్నారంటూ ఉపాధి కూలీలు ఫిర్యాదు చేయండంతో విచారణ చేపట్టారు. గ్రామంలోని రాజకీయ నాయకులు, ఉద్యోగుల పేర్లు మీద మస్టర్లు వేస్తున్నారని వీటిపై విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక అందిస్తున్నట్టు ఏపీడీ తెలిపారు. ఏపీవో దయానందం, టెక్నికల్ అసిస్టెంట్ షమీ ఉన్నారు.

చెరువు కట్ట తొలగింపుపై ఫిర్యాదు



చేపల పెంపకందారుడిని విచారిస్తున్న ఏఈ

పెళ్లకూరు, మే 21: మండలంలోని చిల్లకూరు పెద్ద చెరువు కట్టను యంత్రాలతో చేపల పెంపకందారులు తొలగించడంపై గ్రామస్తులు మంగళ వారం నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో చేపల పెంపకానికి వడ్డిపాళేనికి చెందిన ఎం.రమణయ్య వేలం దక్కించుకున్నాడు. ఈక్రమంలో చెరువు అడుగున ఉన్న చేపలు పట్టుకునేందుకు ఉన్న కొద్ది నీటిని కిందకు వదిలేందుకు ఎక్స్‌కవేటరతో కట్టను తొలగించాడు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి చెరువు కట్టను తొలిగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కట్టను రెండు చోట్ల తొలిగించిన రమణయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సంయమనం పాటించండి



నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ

ఓజిలి, మే 21: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పార్టీల నాయకులు సంయ మనం పాటించాలని నాయుడు పేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఓజిలి పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన మండలంలోని అన్ని పార్టీ నాయకులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఇంకా 144 సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. కౌం టింగ్ పూర్తయ్యే వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవిబాబు, నాయకులు పివెంకటసుబ్బయ్య, బి.పృథ్వీకృష్ణ, రఫి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య


గోవిందు మృతదేహం

శ్రీకాళహస్తి, మే 21: కుటుంబ కలహాలతో ఓ భవన నిర్మాణ కార్మికుడు స్వర్ణముఖి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన వద్ద వెలుగు చూసింది. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధికి చెందిన గోవిందు(45) భవన నిర్మాణ కార్మికుడుగా జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. మూడు నెలలుగా పనికి వెళ్లకుండా కుటుంబసభ్యులతో తరచూ గొడవపడేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో గొడవ పడి బయటకు వెళ్లాడు. గోవిందు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద ఆరా తీశారు. మంగళవారం స్వర్ణముఖి నదిలో గుర్తు తెలియని మృతదేహం నీటిలో తేలుతుండడంతో పోలీసులు ఒడ్డుకు చేర్చారు. మృతుడు గోవిందుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతని భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గంగమ్మకు ముక్కంటి సారె


సారె తీసుకెళుతున్న అంజూరు శ్రీనివాసులు, పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి, మే 21: పట్టణంలోని బీపీ అగ్రహారంలో వెలసిన గంగమ్మకు ముక్కంటి ఆలయం తరపున పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మంగళవారం ముక్కంటి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, పాలకమండలి సభ్యులు సునీత, రమాప్రభ, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, ప్రముఖులు లక్ష్మీపతి, ఆర్కాట్ శంకర్, కేపీఆర్ శశి, సుబ్రహ్మణ్యం, కుమర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలమ్మకు పొంగళ్లు

శ్రీకాళహస్తి, మే 21: పట్టణంలోని పానగల్ రోడ్‌లో వెలసిన పొన్నాలమ్మ అమ్మవారికి మహిళలు పెద్దసంఖ్యలో పొంగళ్లు పెట్టారు. తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఇక్కడ మహిళలు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. టందులో భాగంగా మంగళవారం ఆలయం వెలుపల మహిళలు పొంగళ్లను వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


కలశాలను తీసుకెళుతున్న భక్తులు

ఏర్పేడు, మే 21: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన వాసవి కన్యకాపరరమేశ్వరి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అమ్మవారిని ఉదయం అభిషేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో పేటీఎం యంత్రం చోరీ

వరదయ్యపాళెం, మే 21: మద్యం దుకాణం సూపర్‌వైజర్ వద్ద గల పేటీఎం యంత్రం చోరీకి గురైంది. మండలంలోని సంతవేలూరులో ఉన్న మద్యం దుకాణంలో అశోక్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి దుకాణంలో రోజువారీ విక్రయాల పరిశీలను వెళ్లాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన పేటీఎం యంత్రాన్ని తన ద్విచక్ర వాహనంలో ఉంచాడు. దుకాణంలో లావాదేవీలను పరిశీలించాక తన ద్విచక్ర వాహనం వద్దకు రాగా పేటీఎం యంత్రం కనిపించలేదు. దీంతో అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

వరదయ్యపాళెం, మే 21: వరదయ్యపాళెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పిచ్చాటూరు, మే 21: రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో జనుము, జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 10 కిలోల జనుము, జీలగ విత్తనాలు రూ.440కి అందిస్తున్నట్లు చెప్పారు. పచ్చరొట్ట విత్తనాలను చల్లిన 40 రోజుల తరువాత భూమిని దున్నుకోవడం ద్వారా సారవంతంగా మారుతుందన్నారు.

గంగమ్మకు పొంగళ్లు

కేవీబీపురం, మే 21: కేవీబీపురంలో వెలసిన శీతలాంబ అమ్మవారికి గంగజాతర సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టారు. అలాగే వేమలపూడిలో వెలసిన గంగమ్మకు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు.

చెట్ల నరికివేత

రేణిగుంట, మే 21: రేణిగుంట పంచాయతీ పరిధిలోని పాంచాలినగర్‌లో రోడ్డుపై నీడనిస్తున్న పచ్చని చెట్లను నరికవేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాంచాలినగర్ 4వ వీధిలో 30 ఏళ్ల వయసు కలిగిన ఎనిమిది చెట్లను ఇంటి ముందు ఆకులు రాలుతున్నాయని, కొమ్మలు విరిగిపడుతున్నాయని సాకు చూపుతూ నరికివేశారు. ఇది గమనించిన మరికొందరు తమ ఇళ్ల ముందు చెట్లను కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీధుల్లో చెట్లను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం

రేణిగుంట, మే 21: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రేవంత్‌రెడి కుటుంబ సభ్యులతో కలిసి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో నరసింహులు

సత్యవేడు, మే 21: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులందరూ సహకరించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నరసింహులు కోరారు. మంగళవారం సత్యవేడులోని రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలు భద్రంగా ఉన్నాయని, కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 4వ తేదీ ఉదయం అబ్జర్వర్, ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు, అభ్యర్థుల అనుమతి ఈసీఐ మార్గదర్శకాల మేరకు చేయడం జరుగుతుందన్నారు. సత్యవేడు నియోజకవర్గం సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒక టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్‌గా పాల్గొనే వ్యక్తులు ఈనెల 24 తేదీ లోగా ఫారం 18ని ఆర్వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పోలీసు కేసులు ఉన్న వారిని కౌంటింగ్ ఏజెంట్లుగా అనుమతించబడిందని తెలిపారు. ఏజెంట్లు గంట ముందే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, కెమెరాలు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లరాదని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో రామాంజనేయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవుడి రాజసం



శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి మంగళవారం హనుమంత వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదట స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ధూప, దీపనైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి అమ్మవార్లు శేష వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బండారుపల్లె పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన

ఏర్పేడు, మే 21: ఏర్పేడు మండలం బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు నిర్మల్‌కుమార్ సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండారుపల్లిలో గడప గడపకు వెళ్లి పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ తమ పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన, ప్రతి ఒక్క విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి, వారి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఈ ఏడాది తమ పాఠశాలలో జనని అనే విద్యార్థిని 592 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రధానంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం తమ పాఠశాల ప్రత్యేకత అని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ద్వారకనాథరెడ్డి, కుమార్‌రాజా, ఉమామహేశ్వర్, సురేష్‌బాబు, వెంకటేశులు, మోహన్, సీఆర్పీ వెంకటమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు టీసీల అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ, మే 21: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య మంగళవారం టీసీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తమ పాఠశాలలో 151మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా ఇందులో 133మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరందరూ ఇంటర్‌లో చేరడానికి వీలుగా టీసీలు ఇస్తున్నామన్నారు.

యానాదుల ఇంటి స్థలాలను ఆక్రమించడం దుర్మార్గం

శ్రీకాళహస్తి, మే 21: నిరుపేదలైన యానాదుల ఇంటి స్థలాలను ఆక్రమించడం దుర్మార్గమని ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ఎమ్ఎస్ఆర్ చెంచులక్ష్మి కాలనీలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజీవ్‌నగర్‌కాలనీలో భాగంగా ఉన్న ఎమ్ఎస్ఆర్ చెంచులక్ష్మి కాలనీలో 56మంది యానాదులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. ఇటీవల కొందరు చెంచులక్ష్మి కాలనీలో ఇళ్ల స్థలాలు తమవంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం మంగళవారం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మంగళవారం స్వల్పంగా వర్షం కురిసింది. ఈ సందర్భంగా ఆకాశంలో ఏర్పడిన ఇంద్రధనస్సు చూపరులను ఆకట్టుకుంది. - బుచ్చినాయుడుకండ్రిగ

పెద్దశేష వాహనంపై కల్యాణ వెంకన్న


పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం, మే 21: మండలంలో నెలకొనిన పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు పెద్దశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేకువజామున మూడు గంటలకు ఆలయాన్ని తెరచి, స్వామివారికి నిత్య పూజా కైంకర్యాలు చేపట్టారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజ స్తంభానికి అభిషేకాలు చేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు మధ్య గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వీరరాఘవ దేవస్థానం నుంచి పట్టుసాలీలు ఊరేగింపుగా ఆలయానికి వచ్చి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. 11గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజం నిర్వహించి, దీప, ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న పెద్దశేష వాహనంపై అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నేడు ముత్యాలమ్మకు మొక్కుల చెల్లింపు

శ్రీకాళహస్తి, మే 21: శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ముత్యాలమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించనున్నట్లు ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ తెలిపారు. సుధీర్‌రెడ్డి పేరుమీద అభిషేకం నిర్వహించి, 101 కొబ్బరికాయలతో మొక్కులు చెల్లింపు ఉంటుందన్నారు. టీడీపీ, అనుబంధ సంఘాల నాయకులు, బొజ్జల అభిమానులు హాజరు కావాలని కోరారు.

పుత్తూరు వార్తలు

తాగునీటి సమస్య లేకుండా చూడండి

పుత్తూరు టౌన్, మే 21: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ మునివేలమ్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం పుత్తూరు మండల సర్వసభ్య సమాఏవశం ఎంపీపీ మునివేలమ్మ ఆధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాద్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లుయితే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. అలాగే పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. తడుకు దళితవాడలో పైపులు మరమ్మతులకు గురై తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, విమలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలమ్మ

పండ్ల అలంకరణలో పిడికిలి గంగమ్మ



పుత్తూరు, మే 21: పుత్తూరు పట్టణంలోని పిడికిలి గంగమ్మను వివిధ రకాల పండ్లతో మంగళవారం అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి గంగమ్మ జాతర రోజున స్థానిక గంగమ్మకు విశేష పూజలను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా జాతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పిడికిలి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదార్ల వితరణతో ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు ఉచితంగా ఔషధ మొక్కల పంపిణీ

పుత్తూరు టౌన్, మే 21: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా పుత్తూరు ఆయుర్వేద నిలయం ఆధ్వర్యంలో త్రినేత్ర దివ్య దేవాలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఔషధ మొక్కలను పంపిణీ చేయనునున్నట్లు గ్రీన్ క్రాస్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ రాజు తెలిపారు.